అనలహక్

బసవరాజు వెంకటరాజ్యలక్ష్మమ్మగారు

ఢిల్లీపాదుషా అక్బరు ధర్మప్రభువని పేరు పడ్డాడు. హిందూ ముసల్మాను లనేభేదం లేకుండా ప్రజల నందరిని సమభావంతో చూచేవాడు. బీదసాదలను చూస్తే ఎంతో దయతో ఆదరించేవాడు. ఆయన ఆస్థానంలో బీదలు భాగ్యవంతులు అనేభేదం లేకుండా అందరికీ చో టుండేది.

అక్బరుపాదుషాకి ఒక్కడే కుమారుడు, యువరాజు సలీము. సలీము అంటే అక్బరుకు ప్రాణము. సలీము ఒకనిమిషము కనబడక పోతే అక్బరు ఎంతో ఆదుర్దా పడేవాడు. సలీముకూడ తెలివైనవాడు, బుద్ధిమంతుడు. తండ్రిమాదిరిగానే ధర్మపరిపాలన చేస్తాడని ప్రజలంతా కూడా ప్రేమించేవారు. యువరాజు సలీముకూడా ప్రజలను చాలా ప్రేమించేవాడు. ప్రజల కేదైనా కష్టము వస్తే తనదిగా భావించుకొనేవాడు. అల్లాంటి సలీముకు ఒకనాడు అకస్మాత్తుగా జబ్బుచేసింది. యూనానీ హకీములు, ఆయుర్వేదవైద్యులు మందు లిచ్చారు. ఏమీ నెమ్మదించలేదు. ఒకరోజు యువరాజు సలీము ఇహలోకము విడిచి 'అల్లా' యొద్దకు వెళ్లిపోయినాడు. కోటలో ఎక్కడ చూచినా రోదనధ్వనులే. అప్పు డక్బరు పాదుషా చాలా విచారించాడు. "నా కున్న ఒక్కకొడుకూ చచ్చిపోయినాడే, నారాజ్యం నాతోనే సరా?" అని విచారపడి అక్బరు పాదుషా వైద్యు లందరిని పిలిపించి, "రేపటి లోపల మీరందరు కలిసి యువరాజును బతికించకపోయినట్లయితే మీతలకాయలు తెగగొట్టించి కోటగుమ్మానికి తోరణాలు కట్టిస్తా" నన్నాడు.

అప్పుడు వైద్యు లంతా గడగడలాడిపోయినారు. "బతికించడం మనచేతనైనపనా? యీపాదుషాకి యీవిచారంలో మతిపోయిన ట్టుంది. అది 'అల్లా' చేయవలసినపని గాని మనవల్ల కా" దనుకొని, ఏమీ చేయటానికి తోచక, "రేపటిరోజున మనమంతా పోవలసిందే గదా" అని మసీదుకు వెళ్లి నమాజు చేస్తున్నారు.

ఇంతలోకే షేక్ ఫరీద్ అనే ఫకీరు 'అల్లా'ను ప్రార్థన చేసికొంటూ ఆదారిన పోతున్నాడు. వైద్యులు అతనిని చూచారు. వెంటనే వాళ్లంతా ఒక్కసారిగా వెళ్లి ఆఫకీరు కాళ్లమీద పడ్డారు. ఫకీరు ఆశీర్వదించి లేవ మన్నాడు. 'రక్షిస్తా నంటే గాని లేవ' మన్నారు వైద్యులు. అంత పెద్దప్రమాద మేమీ వుండ దనుకుని, 'రక్షించాను లేవ' మన్నాడు ఫకీరు. ఒక్కసారి వైద్యు లంతా లేచారు. ఏమిటో సంగతి చెప్ప మన్నాడు ఫకీరు. అప్పుడు వైద్యులంతా, "మహానుభావా,

అక్బరుపాదుషాగారి కుమారుడు యువరాజు సలీము చచ్చిపోయినాడు. మా చేత నైన మందు లన్నీ పోశాము. కాని లాభం లేక పోయింది. ఇప్పుడు పాదషాగారు 'యువరాజుని శేపటిలోపల బతికిస్తేనే బతికించారు, లేకపోతే మీతలలు కొట్టించి కోటగుమ్మానికి కట్టిస్తా' మన్నారు. మా యందరి ప్రాణాలు మీ చేతిలో ఉన్నవి." అని దీనవదనములతో నుంచున్నారు. షేక్ ఫరీద్ నిర్ఘాంతపోయినాడు. "అరెరే, ఎంతమోసం జరిగింది! ఏదో కొద్దిప్రమాదం గదా అని అభయహస్త మిచ్చాను. ఇప్పు డేం చేయను? మాట తప్పగూడదు. సరే, పదండి శవందగ్గిర" కన్నాడు. వైద్యు లందరూ బతికా మనుకుని వెంటనే ఫకీరును సలీముశవముదగ్గరకు తీసుకు వెళ్లారు.

అప్పుడు షేక్ ఫరీద్ 'అల్లా'ని ప్రార్థించి శవముచుట్టు తిరిగి మంత్ర ముచ్చరిస్తూ, "అల్లాకా హుకుంసే వుఠ్" (భగవంతునియాజ్ఞచేత లేవవలసినది) అన్నాడు. 'అల్లా' ఒప్పుకోలేదు. సలీము లేవలేదు. ఫకీరు రెండుసార్లు మూడుసార్లు ప్రార్థించాడు 'అల్లా'ను. భగవంతునిఆజ్ఞ లేనందున సలీము లేవడాయెను. ఫకీరుకి చాలా కోపము వచ్చింది. మంత్రోచ్చారణ చేస్తూ శవంచుట్టూ తిరిగి, "అల్లా కా హుకుంసే నై వుఠేతో మేరే హుకుంసే వుఠ్" (అల్లాఆజ్ఞచేత లేవకపోతే నాఆజ్ఞచేత నీవు లేవవలసింది) అని శవాన్ని ఒకతన్ను తన్ని ఆజ్ఞాపించినాడు. వెంటనే సలీము నిద్దర మేలుకొన్నవాడికిమల్లె లేచి కూర్చొన్నాడు. అక్బరు చాలా సంతోషించి ఫకీరుకు జాగీరు ఇవ్వబోయినాడు. అప్పుడు షేక్ ఫరీద్ "ఫకీరువాడిని నా కీజాగీర్లెందుకు? మీ హకీములకే యివ్వండి" అని పుచ్చుకోకుండా వెళ్లిపోయినాడు. వైద్యులు సలీము బ్రతికినందుకు తమని చాలా గౌరవించి ఏ చక్రవర్తులనో చేస్తా రనుకున్నారు పాపము. కాని అల్లా జరగలేదు. అక్బరు ఫకీరుమీదే భక్తితో వున్నాడు. ఇదంతా వైద్యులకు సరిపడలేదు. "మనము ఫకీరుకాళ్లమీద పడితేనే గదా అతను బతికించాడు. మన్ని గౌరవించకపోవటం ఏమి? ఏవిధంచేతనైనా యీ ఫకీరువాడినితన్నించా" లనుకున్నారు. అప్పుడు హకీము లందరూ ఆలోచించుకొని పాదుషా దగ్గరకు వెళ్లి సలాం జేసి, "జహాపనాహ్, యీఫకీరు మొదట అల్లాకా హుకుంసే వుఠ్ అని ప్రార్థించాడు. కాని అల్లా యువరాజును, బ్రతికించటం యిష్టం లేక వూరుకున్నాడు. అప్పుడు యీ ఫకీరు అల్లాను తిరస్కరించి మేరే హుకుంసే వుఠ్ అన్నాడు. అల్లా ఆజ్ఞచేత బతికించాలి కాని తనాజ్ఞచేత బతికించట మేమిటి? దీనికి తమరే ఆలోచించండి జహాపనాహ్ అని మొరపెట్టారు. అక్బరుకూడా ఆలోచించాడు. 'అల్లా ఆజ్ఞచేత లేవమనాలి కాని తనాజ్ఞచేత లేవమనటం ఏమి'టని పాదుషాకు కోపం వచ్చింది. తమ మౌల్వీలను (మతగురువులను) పిలిపించి 'అల్లాను తిరస్కరించినవాడికి ఏ శిక్ష వున్నదో ఖురాన్ చూడ' మన్నాడు. అప్పుడు మౌల్వీలు ఖురా

నుచదివి 'అల్లాని తిరస్కరించినవాడిని బతికుండగానే బల్లాలతో పొడిచి చంపవలసి వుంటుం' దని చెప్పారు. వెంటనే పాదుషా నౌకర్లను పిలిపించి ఆ ఫకీరుని వెతికించి పట్టి తెప్పించి, బల్లెములతో పొడవమన్నాడు. నౌకర్లు వైద్యుల ప్రోత్సాహముతో, బల్లెములతో ఫకీరుని పొడవసాగినారు. ఆవిధంగా బల్లెములతో ఎన్నిరోజులు పొడిచారో వాళ్ళకే తెలియదు. ఫకీరుమాత్రము చెక్కు చెదరకుండా నిశ్చలంగా ధ్యానిస్తూ నుంచున్నాడు. ఏవిధమైన బాధాలేకుండా నౌకర్లశ్రమే గాని బల్లెములు ఫకీరు శరీరంలో దిగటమే లేదు. నౌకర్ల కాయాస మెక్కు వౌతున్నది. ఫకీరుకు మాత్రం వాళ్లు పడే శ్రమ చూస్తే చాలా జాలి వేసింది. "మీా రెన్నాళ్లు శ్రమపడ్డా నా శరీరాన్నిమాత్రం ఏంచెయ్యలేరు. మీారు పడేశ్రమ చూస్తే నాకు మనస్సు కరిగింది. అందుకని చెబుతున్నాను. నా శరీరం అంతా వజ్రదేహం, మీా రేమీా చేయలేరు. ఎన్నాళ్లు మీారు శ్రమపడ్డా యింతే. నాకుడికాలి బొటనవేలుమాత్రం చిన్నప్పుడు అపవిత్రమై పోయింది. అక్కడ గనక పొడిస్తే నేను చచ్చిపోతా" నని చెప్పాడు ఫకీరు. చెప్పిందే తడవుగా పొడవండి పొడవండి అని నౌకర్లు ఆ ఫకీర్ని పొడిచి చంపారు. అప్పుడాఫకీరు పేగుల్లోనుంచి 'అనలహాక్' (నేనే భగవంతుడను) అని ప్రతిధ్వనించింది. అప్పుడు వాళ్లు "అరే, యీాఫకీరు చచ్చిపోయికూడా నేనే భగవంతుడినంటాడేమిటిరా?" అని ఆలోచించి వెంటనే ఫకీరు శవాన్ని తీసుకెళ్లి సమాధి చేశారు. సమాధిలోనుంచి అనలహాక్ (నేనే భగవంతుడను) అని ప్రతిధ్వని వచ్చింది. అప్పుడు నౌకర్లకు చాలా కోపం వచ్చింది. "చచ్చినవాడిని సమాధి చేశాము, యిందులోనుంచి కూడా అల్లాను తిరస్కరించి నేనే భగవంతుడనని అంటున్నాడు. వీడి నేం చేద్దాము రా అనుకుని సమాధిలోనుంచి ఫకీరుశవాన్ని పెళ్లగించి కాల్చి బూడిదచేశారు. ఆబూడిదలోనుంచి కూడా అనలహాక్ (నేనే భగవంతుడిని) అనే శబ్దం వచ్చింది. నౌకర్లకు మరీకోపం వచ్చింది. అప్పుడాబూడిదంతా పోగుచేసి ఎత్తి సముద్రంలో కలిపారు. ఆ సముద్రపలల్లోనుంచి అనలహాక్;(నేనే భగవంతుడి)నని ప్రతిధ్వని వచ్చింది. అప్పుడు నౌకర్లకు పశ్చాత్తాపము కలిగి, "అరే, అల్లాభక్తుడిని చాలా కష్టపెట్టాము; మన కేమిశిక్ష వేసినా యీాపాపం పోదు" అని అప్పుడాప్రతిధ్వని వచ్చేదిక్కుగా అందరు సాష్టాంగపడి తమతప్పు క్షమించమని ప్రార్థించారు. అప్పుడు అల్లాకు మనసు కరగి ప్రత్యక్షమై, "అరే మీారు పశ్చాత్తాపపడ్డారు గనుక మీా పాపం పోయింది. షేక్ ఫరీదు చేసిన మేలు మరచిపోవచ్చునా? మీాప్రాణాలు రక్షించాడే. షేక్ ఫరీద్ ఎవ రనుకున్నారు? నాభక్తుడు! నాభక్తుడు గనుకనే అతనిలో నే నున్నాను. ఇక నెప్పుడు ఇల్లాంటిద్రోహము చేయకండి" అని చెప్పి అంతర్ధాన మైనాడు. షేక్ ఫరీద్ యథాప్రకారంగా లేచి నిల్చున్నాడు. నౌకర్లు సలాములు చేసి తప్పు క్షమించమని వేడు

కొన్నారు. క్షమించా నన్నాడు ఫకీరు. నౌకర్లు అక్బరుపాదుషాదగ్గరకు వెళ్లి సంగతంతా చెప్పారు. పాదుషా హకీములమోసమునకు, హాల్వీలబోధకు చాలా విచారపడి పశ్చాత్తాప మొంది ఆరోజునుంచీ ఫకీర్లయందు చాలాభక్తి గలిగి యున్నాడు.

జోగి

కుందుర్తి నరసింహారావుగారు

అది, మహాగ్ని మంటపగోపురాగ్రసీమ
గంతు లిడఁబోవు ధూమవిగ్రహమురీతి
యువదినేశనేత్రజ్వాల నూఁదఁబోయి
దద్దరిల్లుమేఘాల మధ్యాహ్నవేళ,—
అది, నిదాఘతాపాస్త్రప్రహారబాధ
బీఁటలూఁదియుఁ గన్నీటియూట లోడ్చు
గట్టుకావలివారల గారవించు
నిత్యనిర్మలవాటి, కోనేటిగట్టు,—
అది, కలంకవిహీనాంతరాత్మవీథి
మేఁక వన్నెల పులిమాట పోకఁ జూచి
బ్రమసిపోయి తద్గర్భాంతరమునఁ జొచ్చి
తెలిసి చీల్చి బయల్వాడు తెలుఁగునాడు,—
ఆతఁడు దివ్యగంధ కుసుమావృత
    గాత్రుఁడు, భక్తిమూర్తియై
ఖ్యాతి వహించినాఁడు.— తన
    కంటికి మంటికి నేకధారగాఁ
గాతర మందువాఁ డిపుడు;
    కారణ మెవ్వఁ డెఱుంగువాఁడు ?— పో
నీ, తడియొత్త నొక్కహితు
    నేనియుఁ జీరఁ డిదేమి వింతరా!

ఐనను, సన్న్యసించిన మ
    హాత్మున కిప్పటివేళఁ దోడు గాఁ
బూనెడువాఁ డెవం డనుట
    పుట్టినదో తమచిత్తమందు:— నా
జేనెఁడుకండ్లతోఁ గనిన
    చిత్రము సుం డిది: ప్రత్యహంబు నీ
హానిపదాగ్రభాగముల
    మంటిని దిట్టు శిరంబు లెన్నియో!!
ఏమనుకొంటిరో యెఱుఁగ
    నీతఁడు 'హాని' యనంగ మీరు; నా
కీమహనీయుఁడే నోసటియేడ్పులతో
    నెఱేఁగించె మున్ను;— ది
వ్యామృతవాహినిన్ దఱిసి
    యడ్డము సొచ్చిన యట్లు, మాకు మే
మే మసిఁ బూసుకొంటిమి క్ష
    మించిన యాతనినాల్కఁ గట్టుటన్;
ఓహో! 'జిహ్వా బిగించినార' మన నే
    వో మంత్రముల్ తంత్రముల్
మాహృత్పేటికలందు దాఁగెనని యే
    మాత్రంబు మీలోన మీ